క్లుప్తంగా

నేడు స్కూళ్లకు సెలవు

బిక్కవోలు: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు శనివారం సెలవు ఇస్తున్నట్టు ఎంఈఓ కె.పూర్ణచంద్రరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అల్పపీడనం ప్రభావంతో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో పాఠశాలలకు సెలవు ప్రకటించాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్టు చెప్పారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హెల్మెట్ ధారణతో ప్రాణ రక్షణ

అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి ప్రసన్న



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి రెడ్డి ప్రసన్న

పెదపూడి: ద్విచక్ర వాహన ప్రయాణికులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వారి జీవితానికి భద్రత కల్పించుకోవాలని మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి రెడ్డి ప్రసన్న అన్నారు. అనపర్తి జూనియర్ సివిల్ కోర్టులో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. అనంతరం గ్రామంలోని మెయిన్ రోడ్డులో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించి, ప్రజలకు హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ మూర్తి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిద్దార్థ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు షణ్ముఖరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ భాస్కరరావు సెక్రటరీ రమణమూర్తి, కోర్టు, బార్ సిబ్బంది పాల్గొన్నారు.

విజయదుర్గ అమ్మవారికి పంచామృతాభిషేకాలు



ప్రత్యేకాలంకరణలో విజయదుర్గ అమ్మవారు

పెదపూడి: ఆషాఢ శుక్రవారం సందర్భంగా సంపర గ్రామంలో ఉన్న విజయదుర్గ అమ్మవారికి పంచామృతాభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. ఆలయ అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. లలితాపారాయణం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ జరిగింది.

లింగ వివక్ష సరికాదు

రాజానగరం: సమాజంలో మహిళలు అన్ని రంగాలలో పురుషులతో పోటీ పడుతున్నారని, ఈ తరుణంలో కూడా లింగవివక్ష చూపడం దారుణమని ఐసీడీఎస్ సీడీపీఓ టి.నాగమణి, వన్ స్టాప్ సెంటర్ సైకాలజిస్టు, కౌన్సెలర్ వైష్ణవి అన్నారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం-2లో శుక్రవారం నిర్వహించిన బేటీ బచావో - బేటీ పడావో కార్యక్రమంలో ఆడపిల్లల సంరక్షణ, అవశ్యకతను తెలియజేశారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం పీవీవీ భీమేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో పురుషుల కంటే మహిళల సంఖ్య తక్కువగా ఉందని, ఇది దేశ ప్రగతి, సమాజాభివృద్ధికి మంచిది కాదన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ దుర్గామణి, అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

మధురపూడి: కోరుకొండ మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శనివారం మధ్యాహ్నం 2 గంటలకు కాపవరంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ హేమసుందరరావు తెలిపారు. ఎంపీపీ ఉల్లి వీర వెంకట సత్య సూర్యకుమారి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. వర్షాల నేపథ్యంలో సహాయక చర్యలు, ముంపు ప్రాంత వాసులకు శిబిరాలు, వైద్య, ఆరోగ్య శాఖలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై చర్చిస్తామని తెలిపారు.

గురు పౌర్ణమికి ఏర్పాట్లు



ఆంధ్రా షిర్డీ సాయిబాబా

బిక్కవోలు: మండలంలోని ఆంధ్రా షిర్డీగా పేరొందిన బలభద్రపురం షిర్డీ సాయి ఆలయంలో గురు పూర్ణిమ పూజలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం ఆలయం వద్ద బాబా వారికి క్షీరాభిషేకం, హారతులు, భజనలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు సబ్బెళ్ల పురుషోత్తమరెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద భారీ అన్న సమారాధన ఉంటుందన్నారు.

అత్యధిక వర్షపాతం

సీతానగరం: మండలంలో అత్యధిక వర్షపాతం నమోదయ్యిందని ఏఎస్‌వో డాక్టర్ జె.చిన్నమనాయుడు తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ గురువారం ఉదయం 8.30 నుంచి శుక్రవారం ఉదయం 8.30 వరకూ మండలంలో 26.72 సెంటీమీటర్ల వర్షం కురిసిందన్నారు.

ఉప్పొంగిన కాలువలు.. ముంపులో పొలాలు

- భారీ వర్షాలతో అవస్థలు
- నిలిచిపోయిన రాకపోకలు



చినకొండేపూడిలో ముంపు బారిన పంట పొలాలు



చినకొండేపూడి - చీపురుపల్లి మధ్యలో కల్వర్టుపై ప్రవహిస్తున్న నీరు



సుభద్రంపేటలో ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

సీతానగరం: అధిక వర్షాల కారణంగా కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పలు ప్రాంతాలలో పొలాలు ముంపుబారిన పడ్డాయి. అలాగే కాలువల్లో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో రాకపోకలు అంతరాయం కలుగుతోంది. చినకొండేపూడి శివారున అప్పన్నబాబు చావిడి వద్ద లోకల్వర్టుపై నుంచి వర్షం నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో చిన కొండేపూడి - చీపురుపల్లి గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో చీపురుపల్లి నుంచి సీతానగరం రావాలంటే కోరుకొండ మండలం కోటికేశవరం మీదుగా రాపాక నుంచి రావాలి. అలాగే చిన కొండేపూడికి చెందిన రైతులు పంట పొలాలకు వెళ్లాలన్నా ఇబ్బందులు పడాల్సిందే.

కొట్టుకుపోయిన వ్యక్తి సురక్షితం

చినకొండేపూడి శివారున అప్పన్నబాబు చావిడి వద్ద లోకల్వర్టుపై శుక్రవారం ఉదయం ప్రవాహం పెద్దగా లేదు. దీంతో ముదునూరి వంశీకృష్ణ మోటారు సైకిల్‌పై చీపురుపల్లి వైపునకు వెళ్లాడు. తిరిగి వచ్చే సమయంలో నీటి ప్రవాహం పెరిగింది. వంశీకృష్ణ కల్వర్టును దాటే ప్రయత్నంలో నీటి ప్రవాహంలో కొట్టుకు పోయాడు. కొద్ది దూరంలో ఉన్న చెరువుల గట్టును పట్టుకుని ప్రమాదం నుంచి బయటపడ్డారు. మోటారు సైకిల్ నీటి ప్రవాహంలో కొట్టుకుపోయింది. గ్రామంలోని ఈతగాళ్లను తీసుకువచ్చి వెతికించడంతో మధ్యాహ్నానికి మోటారు సైకిల్ బయటపడింది. నీటి ప్రవాహం ఉధృతంగా ఉండడంతో లోకల్వర్టుపై రాకపోకలు సాగించకుండా కర్రలను అడ్డుగా కట్టారు.

ముంపు బారిన పొలాలు

అధిక వర్షాలతో వరిపొలాలు ముంపులోకి వెళ్లాయి. చినకొండేపూడి, రాపాక, రఘుదేవపురం, నల్గొండ, కూనవరం, ముగ్గళ్ల, ఇనుగంటివారిపేట, వెదుళ్లపల్లి, మిర్తిపాడు, ఉండేశ్వరపురం తదితర గ్రామాలలో పొలాలు మునిగిపోయాయి. వరిఊడ్పులు అయిన కొద్ది రోజులకే అధిక వర్షాలతో నీట మునగడం రైతులు ఆందోళన చెందుతున్నారు. చినకొండేపూడిలో సుమారు 65 ఎకరాలలో వేసిన కూరగాయల పంటకు నష్టం వాటిల్లే అవకాశం ఉంది.

ముంపునకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

రాజానగరం: అల్పపీడన ప్రభావంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా జిల్లాలో వివిధ దశలలో ఉన్న ఖరీఫ్ వరి పంట ముంపునకు గురి కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని దివాన్ చెరువులోని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు రైతాంగానికి సూచనలిచ్చారు. కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు శుక్రవారం మాట్లాడుతూ జిల్లాలో రెండు రోజుల్లోనే 252.1 మి.మీ. వర్షపాతం నమోదైందన్నారు. జిల్లాలో ఇంతవరకు 48,605 హెక్టార్లలో వరి నాట్లు పూర్తికాగా, 8,420 హెక్టార్లలో పాక్షికంగాను, కొన్నిచోట్ల పూర్తిగాను నాట్లు వేశారన్నారు. భారీగా కురుస్తున్న వర్షం నీరు చేలల్లో ఎక్కువ రోజులు నిల్వ ఉండకుండా తగిన యాజమాన్య పద్ధతులు అనుసరించాలని సూచించారు.

అప్రమత్తంగా ఉండాలి

రంగంపేట: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల మండలంలోని ముంపు ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాలశంకరరావు సూచించారు. శుక్రవారం ఆయన మండలంలోని రంగంపేట, దొడ్డిగుంట, సుభద్రంపేట, వెంకటాపురం గ్రామాల్లోని ముంపు ప్రాంతాలను, పారిశుధ్య చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా మండల పరిషత్, సచివాలయాల సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామాల్లో నీరు నిల్వ లేకుండా డ్రైన్లను శుభ్రం చేయాలన్నారు. మంచినీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయాలన్నారు. పరిసరాల శుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ పి.వెంకటరత్నం, పంచాయతీరాజ్ ఏఈ కె.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు మణికుమార్, కాత్యాయని తదితరులున్నారు.



ములకల్లంకలో ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

ములకల్లంకలో కలెక్టర్ పర్యటన

సీతానగరం: గోదావరి వరదను దృష్టిలో ఉంచుకుని అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. గోదావరి మధ్యలో ఉన్న ములకల్లంక గ్రామాన్ని శుక్రవారం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, ఆర్డీవో చైత్రవర్షిణితో కలిసి పరిశీలించారు. తొలుత బొబ్బిల్లంక రేవు నుంచి బోటులో ములకల్లంకకు చేరుకున్నారు. గోదావరి వరద ఉధృతంగా ఉన్నందున గ్రామం విడిచి రావాలని అక్కడి ప్రజలను కలెక్టర్ కోరారు. తమకు గోదావరి వరద అలవాటేనని, పూర్తిస్థాయిలో వరద వస్తే బొబ్బిల్లంక వస్తామని స్థానికులు తెలిపారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ గోదావరి వరద పెరిగితే మర పడవలపై ప్రయాణం నిలిపివేస్తామని, బోటులను ఏర్పాటు చేస్తామన్నారు. తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టిసారించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించామన్నారు. వైద్య ఆరోగ్యశాఖ, రెవెన్యూ, మండల పరిషత్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, ఫిషరీస్, ఏజీఎల్‌టీ, విద్యుత్‌శాఖాధికారులను అప్రమత్తం చేయడం జరిగిందన్నారు. ఏటిగట్టు బలహీనంగా ఉన్న ప్రాంతంలో పటిష్టమైన రక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ రామ్‌ప్రసాద్, ఎంపీడీవో కృష్ణ ప్రసాద్, తహసీల్దార్ నెల్సన్ పాల్‌బాబు, ఈవోపీఆర్డీ మూర్తి, పంచాయతీ కార్యదర్శి రజాస్, వీఆర్వో నాగమణి తదితరులు పాల్గొన్నారు.



శ్రీరంగపట్నంలో ఉధృతంగా ప్రవహిస్తున్న బురద కాలువ

ఉధృతంగా బురద కాలువ

మధురపూడి: కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో ముంపు నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. ఆమె శుక్రవారం శ్రీరంగపట్నం గ్రామాన్ని పరిశీలించారు. వరద నీరు ముంచెత్తితే ప్రజలను సురక్షిత ప్రాంతానికి తరలించి, వారికి పునరావాస శిబిరం ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టర్ వెంట సర్పంచ్ మద్దాల పెద్ద అమ్మాజీ, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, కోరుకొండ ఎంపీడీఓ హేమసుందరరావు, తహసీల్దార్ డి.రాజ్యలక్ష్మి, స్థానిక ప్రజాప్రతినిధులు మద్దాల రమణ, తనకాల నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి జానా శ్రీను ఉన్నారు.

అధికారుల సూచనలతో పంట సంరక్షణ

పెదపూడి: గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నీట మునిగిన వరి పంటను కాపాడుకునేందుకు రైతులు అధికారుల సూచనలు పాటించాలని మండల ఏఓ టీవీఆర్ మణిదీప్ తెలిపారు. మండలంలోని చింతపల్లి, జి.మామిడాడ, వేండ్ర, దోమాడ తదితర గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో మొత్తం 18,500 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారన్నారు. ఇందులో 50 శాతం మేర వరినాట్లు వెదసాగు విధానంలో పూర్తి చేశారన్నారు. మిగిలిన 50 శాతం నారుమడులు ఉన్నాయని చెప్పారు. రైతులు ఆందోళన చెందవద్దని, అధికారుల సూచనలు పాటించి పంటను రక్షించుకోవాలన్నారు.



దోమాడలో వరి పొలాల వద్ద రైతులతో మాట్లాడుతున్న మణిదీప్

రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

మధురపూడి: రాజమహేంద్రవరం ఏరియా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎంపిక శుక్రవారం కోరుకొండలోని ఆదిత్య ఫంక్షన్ హాలులో నిర్వహించారు. రాజమహేంద్రవరం రూరల్, సీతానగరం, రాజానగరం, కోరుకొండ, గోకవరం మండలాలతో ఇటీవల ఈ సంఘాన్ని ఏర్పాటు చేశారు. వీరందరూ గతంలో అనపర్తి అసోసియేషన్‌తో కలిసి ఉండేవారు. రాజమహేంద్రవరం ఏరియా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వల్లేపల్లి శ్రీనివాసు, ఉపాధ్యక్షుడిగా లంక ఆదినారాయణ, కార్యదర్శిగా బీశెట్టి గణపతి, సంయుక్త కార్యదర్శిగా చలంచర్ల కిశోర్, కోశాధికారిగా కంచర్ల సూర్యప్రకాశ్‌లతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ తమ అసోసియేషన్ తరఫున రైతులకు అన్ని విధాలుగా సహకారం అందజేస్తామన్నారు. గతంలో సుదూర ప్రాంతాలకు ధాన్యాన్ని తరలించాల్సి రావడంతో రైతులు ఇబ్బంది పడేవారన్నారు. ఇక నుంచి ఆ ఇబ్బంది లేకుండా స్థానిక రైస్ మిల్లుల యజమానులు తీసుకుంటారన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు, కార్యక్రమంలో సీతానగరం, రాజానగరం, కోరుకొండ, గోకవరం మండలాల రైస్‌మిల్లుల యజమానులు పాల్గొన్నారు.



అధ్యక్షుడు శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న నాయకులు

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

రాజానగరం: వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని వైద్యసిబ్బందికి అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎన్.వసుంధర సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. ఓపీ, ల్యాబ్ రికార్డులను పరిశీలించారు. వర్షాలు కురుస్తున్న ఈ సమయంలో అతిసార, సీజనల్ జ్వరాలు వ్యాపించేందుకు అవకాశం ఉందన్నారు. ఇటువంటి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రావుల చెరువు గట్టు వీధిలో నీటి క్లోరినేషన్ పరీక్షను స్వయంగా పర్యవేక్షించారు. సుబ్బారావు కాలనీలో లెప్రసీ సర్వేను కూడా పరిశీలించిన ఆమె ప్రతి నెలా 10, 11వ తేదీలలో లెప్రసీ డీపీఎంఆర్ కార్యక్రమాలు సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు.



పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ వసుంధర

కూరగాయలకు వరుణ గండం

- నీరు నిలిచిపోతే నష్టమే..
- బయటకు పోయేలా చర్యలు తీసుకోవాలి
- రైతులకు వ్యవసాయాధికారుల సూచనలు

రాజానగరం: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు కూరగాయల సాగుచేసే రైతులను కంగారు పెడుతున్నాయి. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో పొలాల్లో నీరు నిలిచిపోయింది. దీంతో కూరగాయల సాగు ఏమవుతుందోననే ఆందోళన చెందుతున్నారు. సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండలాలలోని సుమారు 1210 ఎకరాలలో వంగ, బెండ, దొండ, టమాటా, బీర, కాకర, పొట్లకాయ, ఆనబ పాదులను వేశారు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు వీటిలో 75 ఎకరాలలో నష్టం వాటిల్లే పరిస్థితులున్నాయి. పొలాలోకి చేరిన వర్షం నీరు వెనువెంటనే దిగువకు పోయేందుకు అవకాశాలు లేకపోవడం, నీరు నిల్వ ఉండడమే ప్రధాన కారణం. ఉద్యాన శాఖ అధికారులు కూడా కూరగాయలు సాగు చేసే ప్రాంతాలకు తరలి వెళ్లి, రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తున్నారు.

పూత రాలిపోయే ప్రమాదం

భారీ వర్షాలకు కూరగాయల మొక్కలు, పాదులకు పూసిన పూత రాలిపోతుంది. అంతేకాక వర్షం నీరు మూడు రోజుల కంటే ఎక్కువ రోజులు నిలిచిపోయి ఉంటే ఆ మొక్కలు, పాదులు చనిపోతాయి. వర్షం ఒకటి, రెండు రోజుల కురిసి ఆగిపోవడంతో పాటు ఆ నీరంతా తీసేస్తే పూతకు కాస్త దెబ్బ ఉంటుందని కానీ, మొక్కలు, పాదులు చచ్చిపోవు. అదే నీరు నిలిచిపోయి, ఎక్కువ రోజులు వర్షం కురిస్తే వివిధ రకాల తెగుళ్లు వ్యాప్తించడానికి కూడా



పాదులను పరిశీలించి, రైతులకు సూచనలు ఇస్తున్న ఉద్యాన శాఖ అధికారి దివ్యశ్రీ

అవకాశం ఉంటుంది. ఈ వాతావరణానికి పురుగులు చేసి, ఎక్కువగా గుడ్లు పెడతాయి, వాటిని నియంత్రించడం రైతులకు కష్టమవుతుంది. అదే కురిసిన వర్షం నీరు నిలవలేకుండా ఎప్పటికప్పుడూ దిగువకు పోతూ ఉంటే పురుగులు పెట్టే గుడ్లను మందులతో నిర్మూలించవచ్చు.

70 శాతం నష్టం తప్పదు

భారీ వర్షాలకు నేల ఊటెక్కిపోతుంది. మొక్కకు ఆహారం సరిపోదు. నీరు అధికం కావడం, ఎండ తగలకపోవడంతో తెగుళ్ల విజృంభిస్తాయి. ఇదే సమయంలో పురుగులు కూడా ఎక్కువగా గుడ్లు పెట్టి, భారీగా ఉత్పత్తి అవుతాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు తీగజాతి అయిన పొట్లకాయ, కాకర, బీర పాదులతో పాటు వంగ, మిర్చి, టమాటా మొక్కలు కూడా దెబ్బతింటాయి. ఎలా చూసిన ఈ వర్షాల వల్ల 70 శాతం నష్టం వాటిల్లుతుంది.

– ప్రగడ రాంబాబు, రైతు, నరేంద్రపురం

రైతులను అప్రమత్తం చేశాం

రాజానగరం మండలంలోని సుమారు 25 ఎకరాలలో దొండ, బీర సాగు చేశారు. ఈ వర్షాలకు ప్రస్తుతం పెద్దగా నష్టం లేదు. కానీ వర్షం నీరు ఇలాగే ఎక్కువ రోజులు నిలిచివుంటే 15 ఎకరాలకు నష్టం వాటిల్లే అవకాశం ఉంది. కూరగాయలు సాగు చేస్తున్న ప్రాంతాలకు వెళ్లి రైతులను అప్రమత్తం చేశాం. వర్షం నీరు నిలిచి ఉండకుండా ఎప్పటికప్పుడూ దిగువకు పోయే విధంగా బోదులు ఏర్పాటు చేసుకోవాలని సూచనలిచ్చాం.

– కె.దివ్యశ్రీ, ఉద్యానశాఖ అధికారి, రాజానగరం

రసవత్తరం... అర్బన్ బ్యాంక్ సమరం

- నేడు 'ఆర్యాపురం' ఎన్నికలు
- అవినీతి కట్టడే అస్త్రంగా నందెపు ప్యానెల్
- అభివృద్ధి చేస్తామంటున్న చల్లా బృందం

రాజమహేంద్రవరం సిటీ: వందేళ్ల పైబడి చరిత్ర కలిగిన ది ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఎన్నికలు రసవత్తరంగా మారాయి. దశాబ్ద కాలం తరువాత శనివారం జరగబోతున్న ఎన్నికల్లో గెలుపు కోసం రెండు ప్యానెళ్ల సర్వశక్తులూ ఒడ్డుతున్నాయి. బ్యాంక్ పాలకవర్గ ఎన్నికలు పార్టీ రహితంగా జరిగేవే అయినప్పటికీ రాజకీయ పార్టీలు తెరవెనుక కీలక పాత్ర పోషిస్తుంటాయి. ఈసారి ఎన్నికల్లో కూడా వైఎస్సార్ సీపీ, తెలుగుదేశం పార్టీలు ప్యానెళ్లకు మద్దతుగా నిలవడంతో ఎన్నికలు ఉత్కంఠను రేకెత్తిస్తున్నాయి.

ముమ్మర ప్రచారం

రాజమహేంద్రవరంలో పేరెన్నికగన్న వెంకటేశ్వరా హోల్‌సేల్ మార్కెట్ చైర్మన్‌గా పనిచేసిన నందెపు శ్రీనివాస్ ఒక ప్యానెల్‌కు, మాజీ చైర్మన్ చల్లా శంకరరావు మరో ప్యానెల్ నుంచి బరిలోకి దిగారు. శంకరరావు హయాంలో బ్యాంక్‌లో జరిగిన అక్రమాల కట్టడే అజెండాగా నందెపు శ్రీనివాస్ ప్యానెల్ ఎన్నికల ప్రచారం నిర్వహించింది. వైఎస్సార్ సీపీ మద్దతు ఇస్తున్న నందెపు శ్రీనివాస్‌కు నగరంలో పలు రంగాల ప్రముఖుల అండగా ఉంది. అలాగే శంకరరావుకు కూటమి మద్దతు పలుకుతోంది. గడచిన వారం రోజులుగా ఇరు పక్షాలు ముమ్మరంగా ప్రచారాన్ని నిర్వహించాయి.



రాజమహేంద్రవరంలో ఆర్యాపురం అర్బన్ బ్యాంకు ప్రధాన కార్యాలయం

హోరాహోరీ..

2013లో జరిగిన ఎన్నికలలో చల్లా శంకరరావు గెలుపొందారు. 2014 – 2018 మధ్య బ్యాంక్ పాలకవర్గ చైర్మన్‌గా వ్యవహరించారు. నాడు రాజమహేంద్రవరం నగరంలో పలువురు ప్రముఖులు తోడ్పాటుతో శంకరరావు విజయాన్ని అందుకున్నారు. కాంగ్రెస్, ఆ తరువాత పీఆర్పీ, తెలుగుదేశం.. ఇలా పార్టీలు మారుతూ వచ్చిన శంకరరావు రెండోసారి ఈ బ్యాంక్ చైర్మన్‌కు పోటీపడుతున్నారు. ఈసారి ఆయనకు నందెపు శ్రీనివాస్ గట్టి పోటీ ఇస్తున్నారు. శ్రీనివాస్‌కు బ్యాంక్ సభ్యులు, పలువురు ప్రముఖులు మద్దతు బలంగా ఉండటంతో శంకరరావు గట్టి పోటీని ఎదుర్కొంటారని రాజకీయ నేతలు విశ్లేషిస్తున్నారు.

శంకరరావు హయాంలో అవినీతి మచ్చ

పాలకవర్గ చైర్మన్‌గా శంకరరావు హయాంలో వెలుగులోకి వచ్చిన పలు అవినీతి, అక్రమాలు అప్పట్లో పెనుదుమారాన్నే రేపాయి. ఫిక్స్‌డ్ డిపాజిట్ల ఉపసంహరణ, కొందరు అధికారులపై ఫిర్యాదులు, జాతీయ రహదారిలో నిర్మించిన మహాలక్ష్మి మార్కెట్‌లో కొందరికి ఆయాచిత లబ్ధి చేకూర్చారనే ఆరోపణలు, నాలుగు దుకాణాలను బినామీ పేర్లతో కొందరికి లబ్ధి చేకూర్చడం, స్థలాలు కొనుగోలు, భవనాల నిర్మాణం పేరుతో బ్యాంక్ నిధులు దారి మళ్లించిన వ్యవహారాలు అప్పట్లో సంచలనమయ్యాయి. ఆ నేపథ్యంలోనే శంకరరావు పార్టీలు ఫిరాయించారని స్థానిక రాజకీయాల్లో చక్కర్లు కొట్టింది. ఆర్థిక అవకతవలపై తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉండగానే శంకరరావు పాలకవర్గంపై కోఆపరేటివ్ చట్టంలో అత్యంత కీలకమైన 51 విచారణకు ఆదేశించడం ఇప్పటికీ బ్యాంక్ సభ్యులు గుర్తు చేస్తున్నారు. ఈ వ్యవహారాల్లో సుమారు రూ.5 కోట్లకు పైగా జరిమానా విధించటంతో న్యాయసానం నుంచి స్టే తెచ్చుకున్నారు.

పోలింగ్ కేంద్రాలు

రాజమహేంద్రవరం పరిధిలోని 8 బ్రాంచిలలో 70,519 మంది ఓటర్ల కోసం 48 పోలింగ్ కేంద్రాలను ఎస్‌కేవీటీ డిగ్రీ కాలేజీ, ఎస్‌కేవీటీ ఇంగ్లిషు మీడియం హైస్కూల్ ప్రాంగణాల్లో ఏర్పాటు చేశారు. ఆదివారం లెక్కింపు జరుగుతుంది.

లింగనిర్ధారణ కోసం స్కానింగ్ చేస్తే చర్యలు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): లింగ నిర్ధారణ కోసం స్కానింగ్ చేయడం నేరమని, అలాంటి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా న్యాయసేవాధికారసంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు హెచ్చరించారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టం 1994 (పీసీఅండ్‌పీఎన్‌డీటీ యాక్ట్ 1994)పై శుక్రవారం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గర్భంలోని బిడ్డ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు, జన్యుపరమైన, ఇతర లోపాలను తెలుసుకునేందుకు మాత్రమే రిజిస్ట్రేషన్ కలిగి ఉన్న కేంద్రాలు ఈ పరీక్షలు చేయాలన్నారు. ఈ చట్టాన్ని సరైన విధంగా అమలు చేసేందుకు సంబంధిత అధికారులు తరచుగా స్కానింగ్ కేంద్రాలలో తనిఖీలు నిర్వహించాలన్నారు. స్కానింగ్ కేంద్రాల ఆవరణలో ఈ చట్టం గురించి ప్రజలకు అవగాహన కలిగేలా పోస్టర్లు అతికించాలన్నారు. ఏఎన్ఎంలు, ఇతర వైద్య సిబ్బంది ప్రజలకు ఈ విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. ఎవరికి ఎలాంటి న్యాయ సందేహాలున్నా జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించవచ్చని తెలిపారు. అనంతరం వన్ స్టాప్ సెంటర్‌ను సందర్శించి వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.శ్రీహరి బాబు, డిప్యూటీ డీఈఎంఓ డాక్టర్ ఎన్.సత్య కుమార్ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ప్రకాష్‌బాబు

కుష్ఠు వ్యాధి నివారణకు చర్యలు

సీతానగరం: కుష్ఠువ్యాధి వంశపారంపర్యంగా రాదని జిల్లా లెప్రసీ కంట్రోల్ కార్యాలయం డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ ఐ.వీర్రాజు అన్నారు. రఘుదేవపురంలో జరుగుతున్న సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వ్యాధిని సమూలంగా తగ్గించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పీహెచ్‌సీ సీహెచ్‌వో పి.వెంకటరత్నం, హెల్త్ సూపర్‌వైజర్ కె.సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ లిజి, ఏఎన్ఎం అమృత, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

'మిస్ రాజమహేంద్రవరం' ప్రోగ్రామ్ వాయిదా

రాజమహేంద్రవరం సిటీ: రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన మిస్ రాజమహేంద్రవరం ప్రోగ్రామ్ వాయిదా పడింది. స్థానిక వేంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో శనివారం ఈ కార్యక్రమం జరుపుతామని గతంలో నిర్వాహకులు ప్రకటించారు. అయితే భారీ వర్షాల కారణంగా వాయిదా వేసినట్టు శుక్రవారం క్లబ్ అధ్యక్షుడు ఇమ్మని వెంకట్ తెలిపారు.